నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# నల్లగొండ

మంగళవారం 20 జూన్ 2023
TUESDAY, JUNE 20, 2023

NALGONDA

పేజీలు : 12
PAGES



నాగారం మండలం ఈటూరు గ్రామంలో మొక్క నాటుతున్న విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, కలెక్టర్ వెంకట్రావ్ తదితరులు

# నాడు విధ్వంసం..
# నేడు పచ్చదనం

## స్వరాష్ట్రంలోనే పర్యావరణ పరిరక్షణ

- సీఎం కేసీఆర్ సారథ్యంలో హరిత విప్లవానికి నాంది
- దేశంలో అత్యధిక గ్రీన్ రెవల్యూషన్ సాధించిన రాష్ట్రం తెలంగాణ
- ప్రభుత్వ సంకల్పానికి పచ్చని చెట్లే సాక్ష్యం
- భవిష్యత్ తరాలకు ఇవ్వాల్సింది ఆస్తులు కాదు.. మంచి వాతావరణం
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- ఈటూరు, గాంధీనగర్‌లో ఘనంగా హరితోత్సవం

8లో..

70 ఏండ్ల పరాయి పాలనలో ధ్వంసమైన పర్యావరణానికి తెలంగాణ హరితహారం గొప్పవరమని, నేడు ఆ ఫలితాలు కండ్ల ముందు సాక్షాత్కరిస్తున్నాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం సూర్యాపేట పట్టణ పరిధి గాంధీనగర్, నాగారం మండలం ఈటూరులో నిర్వహించిన హరితోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొమ్మిదో విడుత హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ 2014కు ముందు మొక్కలు నాటే కార్యక్రమం అటవీ శాఖకే పరిమితమయ్యేదని, నాటి పాలకులు పచ్చదనం పెంపుకోసం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమం నడిపించిన తీరు గానే, హరితోద్యమం ద్వారా పెద్ద ఎత్తున ప్రజలతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. దశాబ్దాలపాటు కరువు ప్రాంతంగా మారిన తెలంగాణ నేడు పచ్చని పంటలు, దట్టమైన చెట్లతో చూడముచ్చటగా ఉందంటే హరితహారం కార్యక్రమమేనని చెప్పారు. అతి తక్కువ కాలంలో దేశంలో అత్యధిక గ్రీన్ రెవల్యూషన్ సాధించిన రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కాలుష్యం, అనారోగ్యాల నుంచి రక్షించుకోవడానికి చెట్లు ఎంతో దోహదం చేస్తాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

*– సూర్యాపేట రూరల్/ నాగారం, జూన్ 19*



నార్కట్‌పల్లిలో మొక్క నాటిన జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

# పండుగలా హరితోత్సవం

- జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కల నాటింపు
- భాగస్వాములైన ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ప్రజలు

రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హరితోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణాలు, గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో వేడుకలు చేశారు. సూర్యాపేట, నాగారం మండలం ఈటూరులో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, కలెక్టర్ వెంకట్రావ్‌తో కలిసి మొక్కలు నాటారు. నార్కట్‌పల్లిలో జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, చందంపేట మండలం చిత్రియాలలో ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్.. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య.. మిర్యాలగూడ మండలం అవంతీపురంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి.. చండూరులో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి.. నల్లగొండలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి.. హుజూర్‌నగర్‌లో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి.. అనంతగిరి మండలం ఖానాపురంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్..నందికొండ మున్సిపాలిటీ, అమ్రాబాద్ టైగర్ ఫారెస్ట్ అర్బన్ పార్కులో ఎమ్మెల్యే నోముల భగత్, కలెక్టర్ వినయ్‌క్రిష్ణారెడ్డి మొక్కలు నాటారు.

- లోపలి పేజీల్లో..

## భట్టి పాదయాత్రలో లొల్లి లొల్లి

- నకిరేకల్‌లో వేదాసు, దైద వర్గీయులు తోపులాట
- సైలెంట్‌గా ఉండిపోయిన కొండేటి, చెరుకు సుధాకర్



భట్టి ప్రసంగించే సమయంలో గొడవ పడుతున్న ఇరు వర్గాలు

IVలో..

# చక్కబడిన చదువులు

సమైక్య పాలనలో అస్తవ్యస్తంగా ఉన్న విద్యా వ్యవస్థలో సీఎం కేసీఆర్ సమూల మార్పులు తీసుకొచ్చారు. విద్యతోనే సకలం సిద్ధిస్తాయని భావించి సర్కారు పాఠశాలలు, కళాశాలలను బలోపేతం చేశారు. ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధనను ప్రవేశపెట్టడంతోపాటు డిజిటల్ విద్యను తీసుకొచ్చారు. మన ఊరు– మన బడి, మన బస్తీ–మన బడి కార్యక్రమం ద్వారా సకల వసతులు కల్పిస్తున్నారు. సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. నాడు వెలవెలబోయిన స్కూళ్లు నేడు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. జిల్లాలో గురుకులాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడంతో పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుబాటులోకి వచ్చింది. నల్లగొండ, సూర్యాపేట జిల్లా కేంద్రాలకు మెడికల్ కళాశాలలు రాగా.. జిల్లాలో నర్సింగ్ కళాశాలలు ఏర్పాటయ్యాయి. స్వరాష్ట్రంలో పెద్ద ఎత్తున నిధులు రావడంతో మహాత్మాగాంధీ యూనివర్సిటీ అన్ని వసతులు సమకూర్చుకున్నది. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. నల్లగొండలో జరిగే వేడుకలకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరు కానున్నారు. విద్యా వ్యవస్థలో సరళీకరణ, సమాచార సేకరణకు పాఠశాలలకు ట్యాబ్స్ పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు, ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులు అందించనున్నారు.

*– రామగిరి, జూన్ 19*



- స్వరాష్ట్రంలో అందుబాటులోకి వచ్చిన కేజీ టు పీజీ ఉచిత విద్య
- కార్పొరేట్ స్థాయిలో గురుకులాలు ఏర్పాటు
- సర్కారు స్కూళ్లు, హాస్టళ్లలో సన్నబియ్యంతో రుచికరమైన భోజనం
- మన ఊరు -మన బడితో సకల వసతులు ఆంగ్ల మాధ్యమంలో బోధన
- చేరువైన మెడికల్, నర్సింగ్ విద్య
- రాష్ట్ర అవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా నేడు విద్యా దినోత్సవం
- నల్లగొండలో పాల్గొననున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- ఉత్తమ ఉపాధ్యాయులు, ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులు

3లో..